క్లుప్తంగా

సామూహిక అక్షరాభ్యాసం



ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు బలిజపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పది మంది ప్రీస్కూల్ పిల్లల చేత గురువారం సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ సుబ్బమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు గ్రామంలో మోడల్ ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్కూల్ రెడీనెస్ మేళాను నిర్వహించారు. హెచ్‌ఎం మోహన్‌రావు పాల్గొని మోడల్ పాఠశాలలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం మైపాడు పాఠశాలను మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా గుర్తించి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులతో అభివృద్ధి చేస్తోందన్నారు. సీడీపీఓ కరణం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ గురువారం జల చైతన్య ప్రశంసాపత్రం అందుకున్నారు. నీటి వనరుల పరిరక్షణ, నిర్వహణ తదితర అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేసినందుకు ఛత్తీస్‌ఘడ్ రవిశంకర్ విశ్వ విద్యాలయం వారు ప్రశంసాపత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా పంపించారు. దీనిని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, ఎంఈఓ రత్నం తదితరులు ఉపాధ్యాయుడికి అందజేశారు.

రేపు సామూహిక యోగా కార్యక్రమాలు

నెల్లూరు రూరల్: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహిక యోగా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా యోగా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

రంగడికి జ్యేష్ఠాభిషేకం నేడు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి శుక్రవారం ఉదయం 9 గంటలకు తేనెతో జ్యేష్ఠాభిషేకం, సాయంత్రం గోపురోత్సవం జరుగుతుందని ఈఓ ఎ.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

ఎంఈఓ సుప్రియకు డాక్టరేట్



నెల్లూరు (టౌన్): సైదాపురం మండల ఎంఈఓగా పనిచేస్తున్న వి.సుప్రియకు డాక్టరేట్ లభించింది. ఆమె ప్రొఫెసర్ ఉషారాణి పర్యవేక్షణలో ఉమెన్ స్టడీస్ విభాగంలో ఇన్‌ఫ్లుయన్స్ ఆఫ్ హోమ్ అండ్ స్కూల్ ఎన్విరాన్‌మెంట్ ఆన్ ది వాల్యూస్ ఆఫ్ అడోలసెంట్ గర్ల్స్ – ఏ కల్చరల్ స్టడీ అనే అంశంపై పరిశోధన గానూ శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

ఫీజు రాయితీ కల్పించాలని వినతి



నెల్లూరు రూరల్: అన్ని ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు గురువారం కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇచ్చేలా చూడాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే డీఈఓకు ఫోన్ చేశారని, ప్రభుత్వాదేశాల ప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు దయాశంకర్, ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు కాజా శ్రీధర్ తదితరులు ఉన్నారు.

యోగాంధ్రతో సతమతం

- అధికారులు, సిబ్బందిపై తీవ్ర పనిభారం
- లక్ష్యాలను అధిగమించేందుకు నానాతంటాలు



ర్యాలీ చేస్తున్న అధికారులు (ఫైల్)

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం ప్రస్తుతం అధికారులు, గ్రామస్థాయి ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోంది. మే 21న ప్రారంభమైన కార్యక్రమం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో ఘనంగా నిర్వహించాలన్న లక్ష్యంతో కొనసాగుతోంది. అయితే దీనివల్ల స్థానిక సిబ్బంది మానసికంగా, శారీరకంగా తీవ్రంగా నలిగిపోతున్నారు. గ్రామ సెక్రటరీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, యోగా మాస్టర్ ట్రైనర్లు ఇలా ప్రతి ఉద్యోగిపై కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు, శిక్షణ కార్యక్రమాలు, పోటీల నిర్వహణ బాధ్యతలు వేయడంతో పనిభారం విపరీతంగా పెరిగింది.

పోటీల పేరుతో అసాధ్యమైన ఆసనాలు

పోటీల కోసం 10 నుంచి 18 ఏళ్లు, 19–35, 35 ఏళ్లు పైబడిన వారికి ఇలా మూడు వేర్వేరు విభాగాలు నిర్ణయించినప్పటికీ, వాస్తవంగా 50 ఏళ్లు పైబడిన వారి సంఖ్య తక్కువగా ఉండడంతో 35 ఏళ్లలోపు వారితో పోటీ పడే పరిస్థితి ఏర్పడింది. దీంతో వారు అసహనంతో ఉన్నారు. పోటీల్లో సూచించిన కొన్ని ఆసనాలు సాధారణ శారీరక స్థితిలో చేయలేని విధంగా ఉండటంతో తమ పేర్లు తొలగించాలని కోరుతున్నారు. అయినా అధికారులంతా పాల్గొన్నట్టు గణాంకాల కోసం తంటాలు పడుతున్నారు.

గంటల కొద్దీ టెలీ కాన్ఫరెన్సులు

కలెక్టర్ స్థాయి నుంచి ఆయుష్ శాఖ అధికారులు, ఇతర శాఖల జిల్లా అధికారుల వరకు రోజూ గూగుల్ మీట్, వెబెక్స్ ద్వారా సమీక్షలు నిర్వహించడంతో గంటల కొద్దీ సమయం వృథా అవుతోందని ఉద్యోగులు వాపోతున్నారు. కింది స్థాయి ఉద్యోగులు మాత్రం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలను పోటీలకు చేర్చాలన్న ఆదేశాలతో సతమతమవుతున్నారు. మ్యాట్ లేకుండా నేలపై ఆసనాలు వేయాలని ఒత్తిడి తెస్తుండటంతో ఆరోగ్యపరంగా కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతే కాకుండా యోగాంధ్ర కార్యక్రమాల ద్వారా సాధారణ విధులకు తీవ్ర ఆటంకంగా మారిందని వారు వాపోతున్నారు.

ప్రజల సహకారం లేకుండా..

ప్రజల ఆసక్తి లేకపోయినా, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాల్సిన పరిస్థితిలో అధికారులు నానా తంటాలు పడుతున్నారు. పోటీల్లో ఆసక్తి చూపని వారిని బలవంతంగా చేర్చాల్సిన స్థితి ఏర్పడిందని వారు అంటున్నారు. పూర్తి శిక్షణ లేకుండా క్లిష్టమైన ఆసనాలతో పోటీలను నిర్వహించాలన్న మార్గదర్శకాలు భవిష్యత్తులో ప్రమాదకరమైన పరిణామాలకు దారి తీసే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గత ప్రభుత్వ కాలంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో 'ఆడుదాం ఆంధ్రా' అనే కార్యక్రమాన్ని తక్కువ వ్యవధిలో, ఉద్యోగులపై అదనపు భారం లేకుండా విజయవంతంగా నిర్వహించామని అధికారులు గుర్తు చేస్తున్నారు. అయితే యోగాంధ్ర పేరుతో నెలరోజులుగా తమ పని, సమయం రెండు వృథా అవుతుండటం బాధాకరమని వారు వాపోతున్నారు.

మర్యాదపూర్వకంగా..



విడవలూరు: ప్రసన్నకు పూలమొక్క అందజేస్తున్న విష్ణువర్ధన్

కోవూరు: వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏడెం లక్ష్మీకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శివుని నరసింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కవరగిరి శ్రీలత, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ నలుబోలు సుబ్బారెడ్డి, పడుగుపాడు సొసైటీ మాజీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కవరగిరి ప్రసాద్, గంగవరం ఉపసర్పంచ్ గోడ మోషే, ఐటీ సెల్ కోవూరు అధ్యక్షుడు చెన్నారెడ్డి, మహిళా నేతలు విజయలక్ష్మి, పద్మావతి, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

- విడవలూరు: మండలంలోని మన్నదరావుపేట గ్రామానికి చెందిన దేవి విష్ణువర్ధన్ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ప్రసన్నకుమార్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్కను అందజేశారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, పార్టీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, పార్టీ నాయకులు కలువ బాలశంకర్‌రెడ్డి, బుచ్చి మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



కోవూరు: ప్రసన్నకు పూలమొక్క అందజేస్తున్న లక్ష్మీకుమారి

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కోర్సుల్లో 2025 – 26 విద్యాసంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్వీ సాంబశివమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వచ్చేనెల 15వ తేదీలోగా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందన్నారు. సోయింగ్ టెక్నాలజీ (8వ తరగతి పాస్, ఒక ఏడాది), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ (10వ తరగతి పాస్, ఒక ఏడాది), డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ (10వ తరగతి పాస్, రెండేళ్లు), హార్టికల్చర్ (10వ తరగతి పాస్, ఏడాది)ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎలాంటి కాల్‌లెటర్స్ పంపమని, వచ్చే నెల 17వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. కౌన్సెలింగ్ 21, 22 తేదీల్లో ఉదయం 10 గంటలకు ఐటీఐ కాలేజీ వద్ద జరుగుతుందని తెలియజేశారు.

సాయినాథునికి విశేష పూజలు



మనుబోలు: మండలంలోని మనుబోలు, జట్లకొండూరు గ్రామాల్లో ఉన్న సాయిబాబా మందిరాల్లో గురువారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ బాబా విగ్రహాలకు పుష్పాలంకరణ చేశారు. మనుబోలులో మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

- పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవ నిర్వహించారు.

దుప్పట్ల పంపిణీ

రాపూరు: మండలంలోని రావిగుంటపల్లి సమీపంలో ఉన్న లెప్రసీ కాలనీలోని కుష్టు వ్యాధి గ్రస్తులకు జిల్లా కుష్టు నివారణ అధికారులు గురువారం దుప్పట్లు, లుంగీలు, టబ్‌లు అందజేశారు. వేపినాపి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రమీలా రాజకుమారి మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులకు చెప్పుల కోసం కొలతలు తీసుకున్నారని, వాటిని సైజుల వారీగా తయారు చేయించి అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కుష్టు నివారణాధికారులు మోహన్‌రావు, నరసింహం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్‌సీసీ శిక్షణా శిబిరం

నెల్లూరు (టౌన్) : విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 20వ తేదీ నుంచి 29వ తేదీ వరకు తొమ్మిదో ఎన్‌సీసీ నావెల్ వార్షిక శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు అనంతపురం జిల్లాలకు సంబంధించిన వివిధ కళాశాలలు, పాఠశాలల ఎన్‌సీసీ నావెల్ క్యాడెట్లు హాజరుకానున్నట్లు వెల్లడించారు. శిక్షణా శిబిరంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, భావిభారత వీర సైనికులుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరుకావాలన్నారు.

'తల్లికి వందనం' ఇవ్వాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ యూనియన్ తదితరులు

తోటపల్లిగూడూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బందికి తల్లికి వందనంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఇందుకూరుపేట ప్రాజెక్ట్ కార్యదర్శి ఎస్కే మస్తానమ్మ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులు, సిబ్బంది సమస్యల్ని పరిష్కరించాలంటూ గురువారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మస్తానమ్మ మాట్లాడుతూ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినప్పటికీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సిబ్బందికి వేతనాలను పెంచడం లేదన్నారు. రేషన్ కార్డులను సైతం ఇవ్వడం లేదన్నారు. అనేక సంక్షేమ పథకాలకు దూరమవుతూ అంగన్‌వాడీ సిబ్బంది దుర్భర జీవితం గడుపుతున్నట్లు చెప్పారు. ఈనెల 23వ తేదీ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది విచ్చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంతో చదువుకు దూరం

- బడి ఎదుట తల్లిదండ్రుల నిరసన
- పిల్లలు నడిచి ఎలా వెళ్తారని ప్రశ్న

చిల్లకూరు: పిల్లలను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలో విలీనం చేయడం తగదని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. వారు గురువారం ఏరూరులోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 130 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. దాన్ని కూటమి ప్రభుత్వం ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. పాఠశాలలో ఉన్న 1 నుంచి 5వ తరగతులకు చెందిన 36 మంది పిల్లలను అల్లీపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తమ గ్రామం నుంచి అక్కడికి రెండు కిలోమీటర్ల దూరం ఉందన్నారు. చిన్న పిల్లలు అంత దూరం ఎలా వెళ్తారని ప్రశ్నించారు. అంతేగాక అక్కడున్న గదులు 20 మందికి మాత్రమే సరిపోతాయని, మిగిలిన పిల్లలను ఆరుబయట కూర్చోబెట్టాల్సి వస్తుందని వివరించారు. అల్లీపురం వెళ్లే ప్రధాన రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలతోపాటు నెల్లూరు, ముత్తుకూరు, వరగలి గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయని వెల్లడించారు. పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారులు స్పందించి పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతామని తెగేసి చెప్పారు. అనంతరం ఎంఈఓతోపాటు స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

అవకతవకలకు పాల్పడితే సహించేది లేదు



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్

తోటపల్లిగూడూరు: చౌకదుకాణాల్లో సరుకుల పంపిణీకి సంబంధించి డీలర్లు అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని తహసీల్దార్ పద్మావతి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం చౌకదుకాణాల డీలర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ డీలర్లు ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు విధిగా రేషన్‌ను పంపిణీ చేయాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించి స్టాక్ రిజిస్టర్‌లో సరుకుల వివరాలను నమోదు చేయాలన్నారు. సరుకుల పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. రేషన్ పంపిణీ విషయంలో ఫిర్యాదులు అందినా, అవకతవకలకు పాల్పడినా సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీటీ శివయ్య, ఆర్‌ఐ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ప్రసన్న పరామర్శ



జనార్దనరెడ్డిని పరామర్శిస్తున్న ప్రసన్న

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పంబాల జనార్దనరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు. జనార్దన్‌రెడ్డి తండ్రి సుధాకర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ క్రమంలో ఆయన ఉత్తరక్రియలు గురువారం స్వగ్రామంలో జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రసన్న గంగపట్నం విచ్చేసి సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నాయకులు రూప్‌కుమార్‌రెడ్డి, ఫణీంద్రనాయుడు, మహీధర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సంగం వెంకయ్య, శ్రీహరికోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం



విజయభాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కాకాణి పూజిత

- కాకాణి పూజిత

ముత్తుకూరు(పొదలకూరు): సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత పేర్కొన్నారు. ముత్తుకూరు మండలం దువ్వూరువారిపాళెం వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో పూజిత గురువారం ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సర్వేపల్లి ప్రజల ఆశీర్వాదం తమ కుటుంబంపై ఉన్నట్టు తెలిపారు. అక్రమ కేసులు బనాయించి కాకాణిని జైలుకు పంపినా ప్రజలు అండగా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యుడు తప్పు చేయరనే భావన కార్యకర్తల్లో ఉందని, మా నాన్నను సొంత మనిషిగా భావించి అండదండలు అందిస్తున్నట్టు వెల్లడించారు. సర్వేపల్లి కార్యకర్తల రుణం ఏమిచ్చి తీర్చుకోగలమని, నాన్న త్వరలో అక్రమ కేసుల నుంచి బయటపడి ప్రజా జీవితంలోకి వస్తారన్నారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు మాని అభివృద్ధి పనుల వైపు దృష్టి పెట్టాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యను వ్యాపారం చేయడం దుర్మార్గం



నరుకూరు సెంటర్‌లో బైక్ ర్యాలీ

తోటపల్లిగూడూరు: ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని, ఇది దుర్మార్గపు చర్య అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వెన్ను వేణు అన్నారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో గురువారం ఎస్ఎఫ్ఐ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పలు యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నాయన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో అధికంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దేవేంద్ర, యగ్నేష్, దినేష్, యశ్వంత్, బాబీ, సుకుమార్, నాగేంద్ర, వంశీ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారిణి

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలోని మల్లుగుంటసంఘం ప్రాథమిక పాఠశాలలో గురువారం అతిసార వ్యాధిపై కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక అవగాహన కల్పించారు. అతిసార ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, దోమలు వాలిన ఆహార పదార్థాలు తినడం వల్ల కలిగే అనర్థాలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హంస వాహనంపై శివపార్వతులు



విడవలూరు: మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్సవాల్లో భాగంగా శివ పార్వతులు గురువారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలతో ప్రత్యేకాలంకరణ గావించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఉభయకర్తలుగా వరిణి గ్రామానికి చెందిన కందికట్టు సులోచనమ్మ, మయూరమ్మ కుమారులు సురేష్‌కుమార్, అశోక్‌కుమార్, శిఖివాహన్ వ్యవహరించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

- వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్ర గాయాలపాలైన ఖలీల్

కొడవలూరు: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టి వెళ్లిపోవడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైంది. ఈ ఘటన మండలంలోని టపాతోపు వద్ద గురువారం చోటుచేసుకుంది. కోవూరు మండలం కోనమ్మతోటకు చెందిన ఖలీల్ బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ టపాతోపు వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న ఖలీల్ కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. బైక్‌ను ఢీకొట్టిన లారీ వెళ్లిపోతుండగా రామన్నపాళెం గేటు వద్ద స్థానికులు నిలిపి వేసి పోలీసులకు సమాచారం అందించారు.